క్లుప్తంగా

శాకంబరిగా బాలకనకదుర్గమ్మ



కాకినాడ రూరల్: ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవార్లను కూరగాయలతో భక్తులు అలంకరిస్తున్నారు. రమణయ్యపేట గ్రామం శేషాద్రినగర్‌లోని బాల కనకదుర్గమ్మ తల్లి శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు తీసుకువచ్చిన కూరగాయలతో అమ్మవారిని అందంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లింగం రవి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కాగితపు సంచులతో కాలుష్య నివారణ



కాగితపు సంచులను పంచిపెడుతున్న దృశ్యం

కాకినాడ రూరల్: పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న ప్లాస్టిక్ స్థానంలో కాగితపు సంచులను వినియోగించాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వాటి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాజా, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

17న మరిడమ్మతల్లి జాతర

తుని రూరల్: ఎస్.అన్నవరంలో లక్ష్మీదేవి చెరువు గట్టుపై కొలువైన మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 17న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి గురువారం ఉదయం వరకూ జాతర నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు పోలరౌతి చక్రరావు, కార్యదర్శి కీర్తి నాగేశ్వరరావు, కోశాధికారి మోకిన సురేష్ తెలిపారు. 18న తీర్థం నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పిస్తామన్నారు.

ఆక్రమణలపై కఠిన చర్యలు

- కమిషనర్ వెంకటరావు హెచ్చరిక
- నిర్మాణం తొలగింపు పర్యవేక్షణ



కార్పొరేషన్ స్థలంలో నిర్మాణం తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: కార్పొరేషన్ స్థలాలను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు హెచ్చరించారు. స్థానిక జయేంద్ర నగర్ ప్రాంతంలో కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి చేసిన నిర్మాణాన్ని కమిషనర్ పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంక్రోచ్‌మెంట్ చట్టం ప్రకారం కార్పొరేషన్ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేయడం నేరమన్నారు. అటువంటి వ్యక్తులు స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగించాలని ఆదేశించారు. లేని పక్షంలో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే ఆక్రమణలు తొలగించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్పొరేషన్ తరఫున ఆక్రమణలను తొలగించే క్రమంలో జరిగే నష్టాలకు యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. త్వరలోనే మున్సిపల్ స్థలాల్లోని ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు

కొన్ని ఖాళీ స్థలాల్లో చెత్త, నిలువ నీరు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయని, వాటిని తక్షణమే తొలగించాల్సిందిగా ఆయా స్థల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ వెంకటరావు తెలిపారు. స్థలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం వల్ల దోమల వృద్ధి చెంది ప్రజారోగ్యానికి ఇబ్బందిగా మారుతున్నాయని, అనేక సీజనల్ వ్యాధులకు కారణమవుతున్నాయన్నారు. ఈ విషయంలో స్థల యజమానులు స్పందించకపోతే జరిమానాలు విధించడంతో పాటు ఆయ స్థలాల్లోని చెత్తను నగరపాలక సంస్థ తరఫున తొలగించి అందుకు అయ్యే ఖర్చును వారి నుంచే వసూలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో జరుగుతున్న పూడికతీత పనులను కమిషనర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాజర్, ఆయా సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేయాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ రూరల్: వార్డు సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సూచించారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 50 బి సచివాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులు పరిశీలించారు. సచివాలయం ద్వారా డివిజన్ పరిధిలోని ప్రజలకు అందిస్తున్న సేవలను ఆరా తీశారు. సచివాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని ఆదేశించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

- గ్రీవెన్స్‌లో ప్రజల వినతులపై కమిషనర్ వెంకటరావు
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



గ్రీవెన్స్ సమస్యలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, డయల్ యువర్ కమిషనర్ ద్వారా వచ్చే ప్రతి సమస్యకూ సత్వర పరిష్కారం అందించే దిశగా ఆయా విభాగాధిపతులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సూచించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారంపై అన్ని విభాగాల అధికారులతో కమిషనర్ శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఇప్పటివరకు వచ్చిన ప్రజా ఫిర్యాదులు, చేసిన పరిష్కారం, పరిష్కారం కాకపోవడానికి కారణాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సోమవారం వచ్చే ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రతి శుక్రవారం సమీక్షిస్తామన్నారు. ఈ విషయంలో అన్ని విభాగాల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, సమస్యను పరిష్కరించిన తర్వాత ఫిర్యాదుదారునికి సమాచారం అందించి వారి అభిప్రాయాన్ని కూడా తెలుసుకోవాలని సూచించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, డయల్ యువర్ కమిషనర్ ప్రారంభించిందన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేసి ప్రజా సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ సూచించారు.

గ్రీవెన్స్ ద్వారా 23 సమస్యలు రాగా.. 20 పరిష్కరించామని, మూడు అంశాలు ఇంజినీరింగ్ విభాగం ద్వారా అంచనాలు రూపొందించి పరిష్కరించాల్సి ఉందన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, కార్యదర్శి ఎం ఏసుబాబు, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఈఈ మాధవి, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఏవో శిరీష్, ఆయా విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా రూరల్ నియోజకవర్గానికి చెందిన ఎస్సీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జంగా గగారిన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్‌ను కలిసినట్టు గగారిన్ తెలిపారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌తో జంగా గగారిన్

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి



గొర్రిపూడిలో ఒక ఇంటి వద్ద రుబ్బురోలులోని నిల్వనీటిని పారపోయిస్తున్న వైద్య సిబ్బంది

కరప: అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని ఎంపీడీఓ కె.అప్పారావు అన్నారు. కరప, వేళంగి, వేములవాడ, ఉప్పలంక, గొర్రిపూడి తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ పి.శ్రీనివాసరావుతో కలిసి పర్యటించి గ్రామకార్యదర్శులకు డ్రై డే గురించి వివరించి, తప్పనిసరిగా అమలుచేయాలన్నారు. గ్రామాల్లోని మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకులను వారానికి ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేయించాలన్నారు. క్లోరినేషన్ చేసిన తర్వాతనే తాగునీరు సరఫరా చేయాలన్నారు. గ్రామ కార్యదర్శులు, పంచాయతీ, వైద్య సిబ్బందితో కలిసి గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి నీటినిల్వ లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం వల్ల డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులకు కారకాలైన దోమలు పెరుగుతాయన్నారు. ఇంటింటికీ తిరిగి నీరు నిల్వ ఉండే ప్రదేశాలు గుర్తించి, శుభ్రం చేయించారు. గ్రామాల్లోని డ్రైన్లలో సిల్టు తీయించాలని ఎంపీడీఓ సూచించారు. కార్యదర్శులు కేశవరావు, పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ కంచాలతో కార్మికుల నిరసన



రాక్ సిరామిక్స్ ఎదురుగా ఖాళీ కంచాలతో ఆందోళన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ నుంచి తొలగించిన కార్మికులు శుక్రవారం ఖాళీ కంచాలతో తమ నిరసనను తెలిపారు. కార్మికులను తొలగించి 88 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులకు ఎటువంటి న్యాయం చేయలేదని కార్మిక నాయకుడు చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జాయింట్ లేబర్ కమిషన్ వద్ద ఐదోసారి జరిగిన చర్చలు కూడా విఫలమయ్యాయని తెలిపారు. తమకు సీఐటీయూ అండగా ఉండటం వల్లే ధైర్యంగా ఉన్నామని కార్మికులు తెలిపారు. ఆందోళనలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.క్రాంతి కుమార్, కార్మికులు గంగాధర్, సతీష్, రామకృష్ణ, మల్లికార్జునరావు, వరప్రసాద్, క్రాంతి, అర్జున రావు, సత్యనారాయణ, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

14న నర్సింగ్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



రాజీవ్‌గాంధీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 14న యానాంలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామి విలేకరులకు తెలిపారు. సెంటాక్ ద్వారా ప్రభుత్వ కోటా సీట్ల భర్తీకి నిర్వహించే ఈ పరీక్షకు స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో పరీక్షా కేంద్రంగా కేటాయించారన్నారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. యానాం నుంచి 62 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకే హాలు టికెట్‌తో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. అదేవిధంగా తమ ఫొటో, సంతకాన్ని నిర్దేశిత బాక్సులో అతికించాలని, ఆధార్ తదితర ఏదైన ఒక గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు.

చినుకుకే మడుగులా!

- సిమెంట్ రోడ్లపై నిలుస్తున్న వాననీరు
- వానాకాలంలో మరింత ఇబ్బంది
- పట్టించుకోని పంచాయతీల అధికారులు



రమణయ్యపేట గ్రామంలో ఏపీఐఐసీ కాల్వ గట్టు నుంచి వలసపాకల రహదారికి వెళ్లే మార్గంలో వర్షపు నీటితో నిండిన సిమెంట్ రోడ్డు

కాకినాడ రూరల్: వానా కాలంలో కొద్దిపాటి చినుకులకే నీరు నిలిచిపోయి ఇబ్బందికరంగా మారుతోంది. పల్లపు ప్రాంతాలతో పాటు సిమెంట్ రోడ్లపైనా నీరు నిలుస్తుంటే ఆయా ప్రాంతాల ప్రజలతో పాటు అటుగా రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. కాకినాడ రూరల్ మండలంలో ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొంది. రమణయ్యపేట గ్రామ పరిధిలో ఏపీఐఐసీ కాలనీ కాల్వ గట్టు నుంచి వలసపాకల రోడ్డుకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం నీటి మడుగులా మారినా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఆ మార్గంలో వాటర్ ప్లాంట్ ఉండడడంతో నీటిని పట్టుకునేందుకు వచ్చే స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. శ్రీచైతన్య స్కూల్ అక్కడే ఉండడంతో చిన్నారులతో పాటు తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు ఏపీఐఐసీ కాలనీలో నుంచి భారీ వాహనాలతో పాటు వివిధ పాఠశాలల స్కూల్, కాలేజీ బస్సులు నిత్యం రాకపోకలు సాగించడంతో ద్విచక్ర వాహనచోదకులు, స్థానికంగా నివసిస్తున్న వారిపై బురద నీరు తుళ్లి ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీలు ఉండడంతో రోడ్డుపై నిలిపోతున్న వర్షపు నీటిని తక్షణమే పక్కనున్న డ్రైనేజీల్లోకి కలిసేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే డ్రైనేజీలు కనిపించకుండా అక్రమ కట్టడాలు ఉండడంతో వాటిని తొలగించాలని కోరుతున్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ, వలసపాకల గంగరాజు నగర్ రోడ్డు, వాకలపూడి, తదితర గ్రామాల్లో వర్షపు నీరు ఎక్కువగా రోడ్లపై నిల్వ ఉంటున్నందున తక్షణం డ్రైనేజీల్లోకి పోయే మార్గం ఏర్పాటు చేయాలి. లేకుండా తుఫాన్ సమయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుంది.

గ్రామాల్లో క్షీణించిన పారిశుధ్యం

పలు గ్రామాలలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. ముఖ్యంగా ఈగలు ఎక్కువగా ఉండడంతో తినుబండారాలపై అవి వాలడంతో వాటి ద్వారా డయేరియా, జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలతో పాటు డ్రైనేజీలు, వీధుల్లో బ్లీచింగ్ చల్లాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

డయేరియా సీజన్ కావడంతో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకుంటాం. దోమల నిర్మూలన చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో రోడ్లపై నీరు పోయే మార్గం చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇస్తాం.

– కె.నాగేంద్రకుమార్, ఈఓ పీఆర్‌డీ, కాకినాడ రూరల్.

హెల్మెట్ ధారణతో ప్రాణాలు భద్రం

- డీఎస్పీ లతాకుమారి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ లతాకుమారి

పెద్దాపురం: రోడ్డు ప్రమాదాలపై యువత అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ కె.లతాకుమారి అన్నారు. మండలంలోని దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు అధ్యక్షతన ట్రాఫిక్ నియమాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు యువత హెల్మెట్ తప్పని సరిగా ధరించాలన్నారు. తద్వారా ప్రమాదాలు తప్పించుకోవచ్చు అన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ హరినాథరెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారిలో చాలా మంది హెల్మెట్ లేకపోవడం వల్లే మృతి చెందుతున్నారన్నారు. అనంతరం ట్రాఫిక్ నియమ, నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్, ఎస్ఐ వెలుగుల సురేష్, న్యాయవాదులు బాపూజీ, దుర్గాప్రసాద్, తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షులు కొత్తెం కోటి, మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, లక్ష్మి, కళాశాల ఏఓ సందీప్, పెద్దకాపు, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కుమార షష్ఠి



పంచారామ క్షేత్రంలోని కుమారస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలోని కుమార స్వామి ఆలయంలో శుక్రవారం కుమార షష్ఠి వేడుకలు నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కాగా 14వ తేదీన ఆలయంలో వేంచేసి ఉన్న మహిషాసుర మర్ధిని అమ్మవారి ఆలయంలో దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరుగుతాయని ఈఓ తెలిపారు. భక్తులు అమ్మ వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



వాకతిప్పలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్, వైద్య సిబ్బంది

కొత్తపల్లి: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్లు సారమ్మ, అనంతలక్ష్మి, సుజాత పేర్కొన్నారు. మండలంలోని వాకతిప్పలో ప్రజలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా, బాలల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నివారణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు, చట్టాలను వివరించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సుష్మ మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చదువుతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు సాధ్యమన్నారు. పని వద్దు – బడి ముద్దు నినాదంతో పిల్లలను చదివించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దాకే నాగమహేశ్వరి, రాజ్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణ ప్రసాద్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకతాయిలకు పోలీసుల చెక్



వాహనాలను తనిఖీ చేస్తున్న పెద్దాపురం ఎస్సై సురేష్

సామర్లకోట: స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద పేట్రేగిపోతున్న ఆకతాయిలకు పోలీసులు చెక్ పెడుతున్నారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినులు తమ స్వగ్రామాలకు వెళ్లడానికి ఆలయం వద్ద బస్సుల కోసం వేచి ఉంటారు. ఆ సమయంలో కొంత మంది ఆకతాయిలు మోటారు సైకిళ్లపై తిరుగుతూ ఇబ్బంది పెడుతున్నారు. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. దాంతో ఆకతాయిలు అటుగా రావడానికి భయపడి వెనక్కు మళ్లుతున్నారు. ఈ తనిఖీలు నిత్యం ఉండాలని స్థానికులు కోరుతున్నారు. సరిహద్దు తగాదా పెట్టుకుంటూ ఆలయ ప్రాంతం మీదంటే మీదని సామర్లకోట, పెద్దాపురం పోలీసులు పట్టనట్టు వ్యవహరించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని వారు అంటున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ సిటీ: కాకినాడ జగన్నాథపురం అన్నమ్మ ఘాటీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో వార్షిక మర్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నమ్మఘాటీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని నరసింహారోడ్డు, శివాలయం వీధి, తారకరామనగర్, ఘాటీ సెంటర్, కొవ్వూరు రోడ్డు, సుందర్‌నగర్, పప్పుల మిల్లు ఏరియా, రిక్షాలపేట, పరదేశమ్మపేట, ప్రసాదరావునగర్, సత్యదేవినగర్, ముగ్గుపేట, రెల్లిపేట, బాపూజీనగర్, పద్మనాభనగర్, మేకానారాయణమ్మతోట, కాపులవీధి, మున్సిఫ్ జంక్షన్, కొవ్వూరు, డి-మార్ట్, శుభం కౌంటీ, తూరంగి ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ తెలిపారు.

పోర్టు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో

కాకినాడ పోర్టు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం డీ2 సెక్షన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. దీనివల్ల సంజయ్‌నగర్, పర్లోవపేట, రాజీవ్‌గృహ కల్ప అపార్టుమెంట్లు, వార్ఫురోడ్డు, బుడంపేట, సూర్యనారాయణపురం, తిలక్‌స్ట్రీట్, రంగయ్యనాయుడు వీధి, పాత పోర్టు రైల్వేస్టేషన్ ప్రాంతం, ఏటిమొగ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ తెలిపారు.

ఆనందభారతి ప్రాంతంలో

డీ1 సెక్షన్ పరిధిలోని ఆనందభారతి విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం ఉదయం 7 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. సినిమారోడ్డు, శేషాబ్‌గల్లీ, పోలీస్ లైన్, బ్యాంక్‌పేట, జయరెసిడెన్సీ స్ట్రీట్, శ్రీకాంప్లెక్స్ స్ట్రీట్, కల్పన సెంటర్, సత్యప్రసన్ననగర్, రామకృష్ణారావుపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు ఈ అసౌకర్యానికి సహకరించాలని ఈఈ ప్రసాద్ తెలిపారు.

అలాగే ఇంద్రపాలెం పరిధిలోని డి9 సెక్షన్ పరిధిలో ఉదయం 9 గంటల వరకు 12 గంటల వరకు రేపూరు, గంగనాపల్లి, కొవ్వాడ, చీడిగ, ఇంద్రపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. డెయిరీఫారం సబ్‌స్టేషన్ పరిధిలోని డీ–7 సెక్షన్ పరిధిలోని డెయిరీఫారం సెంటర్, దుమ్ములపేట, పల్లంరాజునగర్, సాంబమూర్తినగర్, అయోధ్యనగర్, రాజీవ్‌గృహకల్ప అపార్టుమెంట్స్, దుమ్ములపేట, రెవెన్యూకాలనీ, సత్యనగర్, స్వర్ణాంధ్రకాలనీ, ఇందిరాకాలనీ, గణేష్‌కాలనీ, జ్యోతులకాలనీ, టిడ్కో అపార్టుమెంట్లు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈఈ ప్రసాద్ కోరారు.

రూరల్ మండలంలో..

కాకినాడ రూరల్: స్థానిక వలసపాకలు సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ కాకినాడ డి4 సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ప్రసాద్ తెలిపారు. వార్షిక మరమ్మతుల నిమిత్తం 33/11 కేవీ వలసపాకలు సబ్ స్టేషన్‌లో గల 11 కేవీ వీఎస్ లక్ష్మి కాలేజ్ ఫీడర్, గంగరాజునగర్ ఫీడర్, వలసపాకల ఫీడర్, గంగాలమ్మ తల్లి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలైన బాలాజీనగర్, కోరమండల్ రోడ్, సుందరయ్య కాలనీ, బొందగుంట, సుధానగర్, మాణిక్యనగర్, నాగార్జున బ్యాంక్ కాలనీ, సౌజన్యనగర్, వీఎస్ లక్ష్మి కాలేజ్, వలసపాకల కృషుడి గుడి, సింహాద్రి నగర్, గంగరాజు నగర్, విఘ్నేశ్వర నగర్, పద్మానగర్, కాకినాడ పబ్లిక్ స్కూల్, రామకృష్ణ నగర్, వాకలపూడి, సూరన్న నగర్, సంతోష్ నగర్, హార్బర్ పేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, ఈ అసౌకర్యానికి గమనించి సహకరించాలని ఈఈ కోరారు.

ఇంద్రపాలెంలో..

ఇంద్రపాలెం 33/11 కేవీ డి9 సెక్షన్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ప్రసాద్ తెలిపారు. రేపూరు, గంగానపల్లి, కొవ్వాడ, చీడిగ, ఇంద్రపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ నియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని పేర్కొన్నారు.

కరపలో..

కరప: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతులు నిర్వహిస్తుండడంతో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఈఈ తెలిపారు. కరపలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కరప సబ్‌స్టేషన్ పరిధిలో 33, 11 కేవీ విద్యుత్‌లైన్‌లో దెబ్బతిన్న స్తంభాలను మార్చి, తీగలను సరిచేస్తున్నట్టు తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని మండల హెడ్‌క్వార్టర్ ఫీడర్ మరమ్మతులు చేస్తున్నామన్నారు. దీంతో కరప, పేపకాయలపాలెం, కొరిపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, వలసపాకల, వేములవాడ, వాకాడ, పెదకొత్తూరు, చినకొత్తూరు గ్రామాల్లోను, పెనుగుదురులో కొంతభాగం విద్యుత్ సరఫరా ఉండదన్నారు. డీఈ వెంట ఏఈ సానా ఈశ్వరప్రసాద్ ఉన్నారు.